# త్యాగం

వులాపు బాలకేశవులు



**ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ బయలుదేర డానికి ఇంకా ఇరవై నిమిషాల వ్యవధి మాత్రమే వుంది. నేను పోర్టర్‌తో కలిసి నా కంపార్టుమెంటు వెతుక్కుంటూ పరుగెడుతున్నాను. చివరకు నా కంపార్ట్‌మెంటు కనిపించటంతో పోర్టర్‌తో సహా ఎక్కేశాను.**

సరిగ్గా అప్పుడే నేను వాళ్ళను చూశాను. అందమైన యువతీ, ఆమెను పట్టుకుని గబగబా మాట్లాడుతున్న ఎనిమిదేళ్ళ నల్లటి పిల్లవాడూ నాకంటే ముందే కంపార్ట్‌మెంటులో కూచుని వున్నారు. నేను పోర్టర్‌ని పంపించేసి ఆమెతో "గుడీవినింగ్.. నేను మిమ్మల్నెక్కడో చూశాను. మీరు.. మీరు.. సిస్టర్ కళావతి కదూ!" అన్నాను సీట్లో కూర్చుంటూ.

ఆమె నవ్వి "ఔను మీరు కెప్టెన్ రాజన్ కదూ!" అన్నది.

"ఇప్పుడు మేజర్ రాజన్‌ని. కెప్టెన్ అప్పుడు" అని నా హోదాను వివరించాను.

ఆమె నవ్వింది. "సారీ డాక్టర్! 1988 తర్వాత మనం ఇప్పుడే గదా కలుసుకుంది. మిమ్మల్ని వెంటనే గుర్తుపట్టలేకపోయాను". ఆ పిల్లాడివైపు తిరిగి "పప్పూ అంకుల్‌కి గుడీవినింగ్ చెప్పు" అంది.

ఆ పిల్లవాడు చాలా వినయంగా 'గుడీవినింగ్' చెప్పాడు.

నేను అతనికి షేక్‌హేండిచ్చి 'గుడీవినింగ్ యంగ్ మాన్' అన్నాను.

"సిస్టర్ ఈ పిల్లవాడెవరు?"

"నా పిల్లవాడే."

"మీకు ఎందరు పిల్లలూ? ఆయన ఎక్కడుంటారు?"

"ఒక్కడే. నాకు భర్త లేడు."

"అరే సారీ సిస్టర్"

"మీరు బాధపడాల్సిన అవసరం లేదు. నాకసలు పెళ్ళికాలేదు." ఆమె పెద్దగా నవ్వింది. నేనాశ్చర్యంగా చూశాను ఆమె వంకే.

"నిజం డాక్టర్. ఈ పిల్లవాడు నాకు పుట్టకపోయినా నా పిల్లవాడే. అసలు వీడు ఎవరో మీకు కూడా తెలుసు" అంది.

నాకంతా అయోమయంగా అనిపించింది.

"మీకు గుర్తులేదూ? 1988లో డిసెంబరు 3వ తారీఖున మీరు డ్యూటీ మెడికల్ ఆఫీసరుగా వున్నారు. నేను కాన్పుల వార్డులో ప్రమాదకరమైన కేసు ఉందని రాత్రి 11 గంటలకు మిమ్మల్ని పిలిచాను. నాయక్ జోజిరెడ్డి భార్య. గర్భసంచి చిరిగిపోయిన కేసు".

నేను డాక్టర్ డిగ్రీ తీసుకోగానే సైన్యంలో చేరాను. అవి హాయిగా చీకూ చింతా లేకుండా కాలం గడిపిన రోజులు. బోలెడు డబ్బు. లెక్క లేకుండా ఖర్చుపెట్టినా అడిగేవాళ్ళు లేరు.

కళావతి అప్పటి మా స్వప్నసుందరి. కళావతి తెల్లగా పంజాబీలకు సహజమైన మంచి ఒడ్డు పొడుగుతో ఉండడమే కాదు, అందమైనది కూడా. ఆమె కంఠం తియ్యగా పలికేది. చాలా బాగా పనిచేస్తుందని పేరు కూడా తెచ్చుకుంది. కానీ అప్పుడామె సీనియర్ కెప్టెన్. మాతో సరదాగా బిడియం లేకుండా మాట్లాడుతున్నా ఆమె నిప్పులాంటి మనిషని అందరికీ తెలుసు. మాతో కలిసి టేబుల్ టెన్నిస్, షటిల్‌కాక్ లాంటి ఆటలు ఆడే సిస్టర్లతో కళావతి కూడా వుండేది.

పార్టీలలో నేను గిటార్ వాయిస్తుంటే ఆమె పాడేది. ఆమె పాడే హిందీ పాటలు, ఇంగ్లీషు

పాటలూ అందర్నీ ఆకర్షించేవి. మా యూనిట్లో కళావతి, రాజన్ జంటకు మంచి స్థానమే ఉండేది.

.. ఆ డిసెంబరు రాత్రి.. ఔను.. మూడవ తారీఖు. నాకిప్పుడంతా స్పష్టంగా గుర్తొస్తోంది. నేను ఆ రోజు డ్యూటీ మెడికల్ ఆఫీసర్ని. రాత్రి పదకొండు గంటలకు కాన్పులవార్డు నుంచి కళావతి వచ్చి పిలిచింది.

"రాజన్ మీరు వెంటనే రావాలి. ఎవరో ఒక మద్రాసు అమ్మాయి మొదటి కాన్పుకోసం వచ్చింది. ఆమె పరిస్థితి బాగోలేదని అనిపిస్తోంది. మీరు వచ్చి చూడండి" అంది.

నేను చలిగాలిని తప్పించుకోటానికి కోటు తొడుక్కుని వార్డుకి వెళ్ళాను. కాన్పుల గదిలో బల్లమీద నల్లని అందమైన అమ్మాయి పడుకొని వుంది. కళ్ళు సగం మూసుకుని సరిగా స్పృహ లేకుండా వుంది. కళావతి ఆమె రక్తపోటు చూస్తోంది. నేను దగ్గరికెళ్ళి నాడి చూశాను. చాలా సన్నగా వేగంగా కొట్టుకుంటోంది. పిండపు కదలికలూ, గుండె చప్పుడూ వినబోతే ఏమీ వినపడలేదు.

"కళా.. వెంటనే గ్లూకోజ్ డ్రిప్ పెట్టు. ఎమర్జెన్సీ ఆపరేషన్‌కు ఆమెను సిద్ధం చెయ్యి" అని చెప్పి హడావిడిగా వెళ్ళాను.

ఆమెను ప్రమాదకరమైన స్థితిలో ఉన్న పేషెంట్ల లిస్టులో చేర్చి, ఆ కాగితాలమీద సంతకం చేస్తున్నప్పుడే ఆమె భర్తపేరు చూశాను. అతను పారాచూట్ బెటాలియన్లో నాయక్. పేరు జోజిరెడ్డి. అతనెక్కడ పనిచేస్తున్నాడో, అతని యూనిట్‌ని ఏ దూరప్రాంతంలో పోస్టు చేశారో తెలీక అతనికోసం నా గుండె కొట్టుకుంది. మేజర్ మల్‌హోత్రా, నేనూ కలిసి ఆపరేషన్ ప్రారంభించాం. మేం భయపడినట్లే ఆమె గర్భ సంచి బాగా చిరిగిపోయింది. మేం పిల్లవాడిని త్వరగా బైటికి తీశాం. కళావతి వార్డ్ సిస్టర్‌గా డ్యూటీలో వుంది. బిడ్డను ఆమె చేతికే ఇచ్చాం. మేజర్ మల్‌హోత్రా చిరిగిన గర్భసంచిని సరిచేసి కుట్టడంలో మునిగిపోయాడు. నేను కళావతి చేతుల్లో వున్న బిడ్డ వంక చూశాను. ఆ బిడ్డ నీలంగా వున్నాడు. కలావతి ట్యూబు వేసి బిడ్డ ముక్కూ నోరూ శుభ్రం చెయ్యటానికి ప్రయత్నిస్తోంది. కానీ బిడ్డలో చలనం లేకపోవ డంతో కంగారు పడుతోంది. బిడ్డని పక్కనున్న టేబుల్‌మీద పడుకోబెట్టి ఆ బిడ్డ వంటినున్న రక్తాన్ని, మురికిని పట్టించుకోకుండా నోట్లో నోరు పెట్టి వూపిరిని వూదుతోంది. కొన్ని సెకండ్లు గడిచాయి. హఠాత్తుగా బిడ్డ కెవ్వు మంటూ ఏడ్చాడు. అమ్మయ్యా.. అందరి ముఖాల్లో సంతోషం.

కళావతి బిడ్డకు స్నానం చేయించి వెచ్చని బట్టల్లో చుట్టి ఉయ్యాలలో పడుకోబెట్టింది. ఆ అబ్బాయి నల్లని ముఖం, వుంగరాల జుట్టూ చూస్తే నాకు చందమామ గుర్తొచ్చాడు. కళావతి తనకు మొదటిసారిగా ఊపిరి అందించిందని తెలిసినట్లుగా కళావతి వేలు గట్టిగా పట్టుకుని నిశ్చింతగా నిద్రపోతున్న ఆ బిడ్డను చూస్తూ అలాగే నిలబడ్డాను.

ఆ మర్నాడే యుద్ధం మొదలవటంతో నేను సరిహద్దు ప్రాంతానికి వెళ్ళిపోయాను. కళావతి లాంటి దగ్గరి స్నేహితులకు కూడా హడావిడిగా గుడ్ బై చెప్పేశాను. ఆ తర్వాత రకరకాల ప్రదేశాలు తిరిగి మళ్ళీ ఇప్పుడే కళావతిని చూస్తున్నాను. పాత జ్ఞాపకాలు మెదడులో కదులుతుండగా నేను ఆశ్చర్యంతో అడిగాను "సిస్టర్.. పప్పు ఆ పిల్లవాడేనా?"

"ఔను డాక్టర్"

"అతని తల్లిదండ్రులు!"

"తల్లి వీడు పుట్టిన ఐదు రోజులకు చచ్చిపోయింది."

"అరే.. ఎందుకలా ? ఏం జరిగింది సిస్టర్?"

"మేజర్ మల్‌హోత్రా ఆమెను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. హఠాత్తుగా 8వ తారీఖు ఉదయం ఆవిడ చనిపోయింది ప్రశాంతంగానే. నాచురల్ డెత్."

"ఐతే మరి ఆ నాయక్ జోజిరెడ్డి - అతనేమయ్యాడు?"

"యుద్ధం ముగిశాక ఐదు రోజులకు మాకు జోజిరెడ్డి యుద్ధంలో చనిపోయాడనే వార్త వచ్చింది. మీరు కూడా ఆ వార్త వినే వుంటారు. బంగ్లాదేశ్‌కి వెళ్ళిన మొదటి పారాచూట్ యూనిట్లోనే అతను ఉన్నాడు"

"సిస్టర్ జోజిరెడ్డి ఇంటినుండి వాళ్ళవాళ్ళెవరూ రాలేదా?"

"జోజిరెడ్డి భార్య అనాథ. జోజిరెడ్డి ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. అతని తల్లిదండ్రులకు ఆ పెళ్ళి ఏమాత్రం ఇష్టం లేదు. అతను ఢిల్లీలో ఉన్నప్పుడు వాళ్ళక్కడ ఇల్లు తీసుకుని కాపురం పెట్టారు. ఆవిడ

**పుస్తకాలు**

## సువాసినీ పూజావిధానము

**సంకలనకర్త** : బ్రహ్మశ్రీ చల్లా లక్ష్మీలలితాప్రసాద శాస్త్రి (దైవజ్ఞ, ఆగమాచార్య)

**ప్రకాశకుడు** : పురాణపండ రాధాకృష్ణ మూర్తి

**మూల్యము** : అమూల్యం (రూ.5 పోస్టల్‌చార్జీల నిమిత్తం పంపిన 2 ప్రతులు ఉచితం)

**పుటలు** : 16

**ప్రాప్తిస్థానము** : పురాణపండ రాధాకృష్ణ మూర్తి, భాగవత మందిరం, 29-6-13 డి, సూర్యాహోటల్ పక్కన, రాజమండ్రి 533 104.




సువాసినీ పూజావిధానము - సుమంగళులకామోదము, సంపత్కరము. ప్రకృతిలో అమ్మను మించినది లేదు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే. ఆ చల్లని తల్లి లలితామ్మ. ఆ తల్లి పాదాలనాశ్రయించిన, సౌభాగ్యదాయకమైన సర్వైశ్వర్యాలు కలుగునని శ్రీ చల్లా లక్ష్మీలలితా శాస్త్రి సువాసినీ పూజావిధానం సౌభాగ్యవతులకై ప్రసాదించిన ఓ దివ్యమైన వరం. ఈ వరం కవిత్వం కాదు. పురాణప్రసిద్ధమైనది. 18 పురాణములలో ఒకటైన బ్రహ్మపురాణం ఉత్తరఖండమున సహస్ర త్రిశత అష్టోత్తరశత విధానములుగా సువాసినీ పూజా విధానం పేర్కొనబడి యున్నది. హయగ్రీవుడు అగస్త్య మహర్షికి చెప్పినట్టిది. మహాచరిత గలది. పావనమైనది. పూర్వజన్మ సుకృత విశేషముంటేనే ఇయ్యది లభ్యం. ఈ పూజ ఎప్పుడెప్పుడు చేసికొన్న ఏయే ఫలితములు కల్గునో, ఎవరు ఏయే ఫలితములు పొందెదరో చక్కగా వివరింపబడింది. సర్వులకు అర్థమగు రీతిలో పూజావిధానం చెప్పబడింది. బీజాక్షరాలతో లలితాష్టోత్తరం చక్కగా సాగింది. దీన్ని పఠించినవారలు ఐహిక ఆయుష్మిక, ఆయురారోగ్య సుఖభాగ్యాలనొందుదురు. అందుకే అమ్మ పాదాలనాశ్రయిద్దాం. సర్వసౌఖ్యాలనందుకుందాం. సర్వశ్రేయస్సులను జుర్రుకుందాం. అమ్మ దయకై అందరం ఎదురుచూద్దాం.

**- విద్వాన్ కో. శ్రీ.**

100% AYURVEDIC PRODUCT
గ్యాస్ట్రబుల్‌తో బాధపడుతున్నారా?
మలబద్ధకము తో
ఇబ్బంది పడుతున్నారా?
కడుపునొప్పి మొదలగు జీర్ణశక్తికి
సంబంధించిన వ్యాధులకు అనేక
సంవత్సరముల నుండి
ప్రయోగములు చేసి చంద్రికా వారిచే
తయారుచేయబడినటువంటి
అతి ఉత్తమమైన ఆయుర్వేద మందు
క్యాప్‌జైమ్
చూర్ణము




జీర, ఇంగువ, సైంధవలవణం, యవాక్షారము,
ఇసఫ్‌గోల్, మారీచము మొదలగు అనేక
రకములైనటువంటి అతి ఉత్తమమైన
ఆయుర్వేద మూలికలతో తయారుచేయబడినది.
ఈ క్యాప్‌జైమ్ చూర్ణమ్ తీసుకొనుట వలన
ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావు
మార్కెట్ చేయువారు
రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కొ.
పార్కురోడ్, విజయవాడ -1. ఫోన్: 2424133.

అంత్యక్రియలు కూడా మేమే చేశాం. అతనింటి నుంచి డబ్బు కోసం కబురు వచ్చిందిగానీ బిడ్డకోసం రాలేదు."

"అయితే తరువాత ఏం జరిగింది?"

"తర్వాత నర్సింగ్ ఆఫీసర్ మెస్‌లో మేమే పిల్లాడిని పెంచాం. పిల్లవాడిని ఏం చెయ్యాలో ఎవరికీ తెలియని ఆ పరిస్థితిలో జోజిరెడ్డి యూనిట్ నుంచి ఎవరో వచ్చి పెంచుకుంటాం ఇమ్మని అడిగారు. కానీ, నాకెందుకో పుట్టినప్పటి నుంచీ వీడంటే తగని ప్రేమ. ఆ ప్రేమ రోజురోజుకీ పెరిగింది. అందుకని యూనిట్ పర్మిషన్ తీసుకుని చట్టప్రకారం దత్తత తీసుకున్నాను."

"నిజంగా నీవెంతో గొప్పపని చేశావు సిస్టర్. నా కొడుకని నీవు చెప్పినా నాకు నమ్మబుద్ధికాలేదు. నీకు ఇంత నల్లటి పిల్లవాడు.."

ఆమె నా మాటల్ని మధ్యలోనే ఆపేసింది. చాలా కోపంగా "డాక్టర్ .. నా కొడుకు నల్లగా వుంటే మాత్రం ఏమయింది? అతనెంత చక్కగా వున్నాడో మీకు కనపడటం లేదూ! క్లాసులో అన్నింటిలో అతనే ఫస్టు మీకు తెలుసా?"

"ఓ సారీ సిస్టర్ నా ఉద్దేశం అది కాదు" కొడుకుని గర్వంగా చూసుకుంటున్న ఆ తల్లి ముందు సిగ్గుతో తల వంచుకున్నాను. "మరీ నీ వివాహం మాటేమిటి? నీవు చేసుకోవాలనుకున్న వ్యక్తి దుబాయ్‌లో పనిచేస్తున్నాడని అప్పట్లో చెప్పేదానివిగా?"

"ఔను అతను వచ్చాడు. అప్పుడు పప్పూకి రెండేళ్ళు. వీడిని నా ఇంట్లో చూసి, వీడు నన్ను అమ్మా అమ్మా అని పిలవటం చూసి" ఆమె చెప్పటం ఆపి చిన్నగా నిట్టూర్చింది.

"మరి మీరు విషయమంతా వివరించి చెప్పలేదూ?"

"అంతా వివరించి చెప్పాను. కానీ అతను నమ్మలేదు."

"ఎందుకని?"

"చాలామంది మిలటరీ నర్సుల్ని గురించి చాలా చెడ్డగా అనుకుంటారు. మా కుటుంబ అవసరాల కోసం, మా కుటుంబాలను, ఇళ్ళను వదలి దేశంలో మారుమూల ప్రాంతాలకొచ్చి పనిచేస్తాం. మా ఒంటరితనాన్నీ ఇంటిమీది బెంగనూ మర్చిపోవటానికి అందరితో సరదాగా కలిసిపోతాం. మా దిగుళ్ళను నవ్వుతూ దూరానికి తరిమేస్తాం. కానీ ఇదంతా ఎవరికి అర్థం అవుతుంది. ఇవన్నీ ఎందుకాలోచిస్తారు? అందరూ మేం ఆఫీసర్లతో కలిసి తాగితందనాలాడతామని, వాళ్ళకు లొంగిపోతామనీ అనుకుంటారు. అందులో నన్ను ఒక బిడ్డతో చూశారంటే.."

"తర్వాత..?"

"తర్వాతా? నన్నెంతో ప్రేమించానన్న వ్యక్తే నన్ను నమ్మలేదు. ఇంకెవరైనా నమ్ముతారని ఎలా అనుకుంటాను. జీవితాంతం పెళ్ళి లేకుండానే వుండిపోవాలని నిశ్చయించుకున్నాను. పప్పూ నా కొడుకులాగానే పెరుగుతున్నాడు. నాకు ట్రాన్స్‌ఫర్ అయిన చోటికల్లా వాడిని తిప్పలేనుగదా! అందుకని ఐదవ ఏడు నుంచే మంచి హాస్టల్లో పెట్టాను."

"మరి స్కూల్లో చేర్చేటప్పుడు సమస్యలేమీ రాలేదా?"

"ఎందుకు రావు. మనదేశంలో కులమతాల ప్రసక్తిలేని లౌకిక రాజ్యాంగముందని చెబుతారు. కానీ పిల్లవాడిని స్కూల్లో చేర్చాలంటే మాత్రం కులం గురించీ, మతం గురించీ అన్ని వివరాలూ అడుగుతారు. నేను జాతి అన్నచోట భారతీ యుడు అని మాత్రం రాశాను. మొదట హెడ్మాష్టరు అప్లికేషను తీసుకోడానికి ఒప్పుకోలేదు. నేనిక అప్పుడు పప్పూ గురించి అన్ని వివరాలూ చెబితే చేర్చుకున్నారు."

"కళా.. నువ్వు నిజంగా గొప్ప మనిషివి. కానీ, కానీ..."

"మీరేం అడగబోతున్నారో నాకు తెలుసు డాక్టర్! అతని తండ్రిపేరు ఏం రాయించా ననేగా? జోజిరెడ్డి అనే రాయించాను. నేను తల్లినే. ఏమయినా అతని తండ్రి జోజిరెడ్డిగదా!"

నా గుండె గొంతుకలోకి వచ్చినట్లనిపించింది. ఆశ్చర్యంతో ఆమె వంకే చూస్తుండిపోయాను.

"ఎందుకలా చూస్తారు డాక్టర్? దేశం కోసం ప్రాణాలిచ్చిన నొక సిపాయి కొడుకుకి తండ్రి కావటానికి ఏ మగవాడికీ ధైర్యం లేనప్పుడూ, ఏ మగవాడూ తనకది గౌరవం కాదనుకున్నప్పుడూ నేను ధైర్యంగా ఆ బిడ్డకు తల్లినయ్యాను. ఆ ధైర్యం నాకుంది. ఈ ధైర్యాన్ని జీవితాంతం ఇలాగే ఉంచుకోగలననే విశ్వాసం కూడా వుంది."

నా ఆవేశాన్ని దాచుకోవటానికి నేను కిటికీలోంచి బైటికి చూడసాగాను. ఆమె కూడా నీళ్ళు నిండిన కళ్ళతో బైటికి చూస్తోంది. బైట నిండు చందమామ ప్రకాశిస్తున్నాడు. ఆ చందమామలో నల్లని అందమైన పిల్లవాడి ముఖం – కాదు, కళావతి ప్రియమైన కొడుకు ముఖం కనిపిస్తోంది. ☆